క్లుప్తంగా

బీమా సొమ్ము పంపిణీ

సామర్లకోట: స్థానిక బలుసులపేటకు చెందిన కొంటేపూడి కుమారి ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా సొమ్ము మంజూరైంది. దీంతో ఆమె కుటుంబ సభ్యులకు తక్షణ సహాయంగా రూ.10 వేలు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు వారా నాగేశ్వరరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్థిక శక్తిగా మార్చేందుకే 'వికసిత్ భారత్'

పెద్దాపురం: రానున్న 2047 సంవత్సరానికి దేశాన్ని ఆర్థిక శక్తిగా మార్చేందుకే కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ ప్రచార యాత్ర చేపట్టిందని పెద్దాపురం మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్ అన్నారు. మండలంలోని తిరుపతి, జె.తిమ్మాపురం గ్రామాల్లో శనివారం వికసిత్ భారత్ యాత్ర జరిగింది. గ్రామ సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఈఓపీఆర్డీ రాజశేఖర్ హాజరయ్యారు. బీజేపీ నాయకులు విత్తనాల వెంకటరమణ, చెరుకూరి రమేష్, దువ్వా శ్రీదేవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం 17 సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులను పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు కుంచే బుచ్చిరాజు, తోట సత్య, కుంచే అమరావతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన

సామర్లకోట: పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరికీ అవగాహన పెరగాలని ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్‌కోర్ రాష్ట్ర సంచాలకులు పి.స్రవంతి అన్నారు. గ్రీన్‌కోర్, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో పర్యావరణ విద్య కార్యక్రమాన్ని స్థానిక ప్రతిభ పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు పెంచండి.. పర్యావరణాన్ని పరిరక్షించండి అనే వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. భవిష్యత్తు తరాలకు ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్రవంతి అన్నారు. అనంతరం ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ, ప్రతిభ పాఠశాల కరస్పాండెంట్ ఎస్‌వీవీజీ ప్రకాష్, పాఠశాల డైరెక్టర్ సుధారాణి, ప్రిన్సిపాల్ టి.సునీత, గ్రీన్‌కోర్ ప్రాజెక్టు అధికారి సత్యనారాయణ, ప్రాంతీయ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మేట్లకు కొనసాగిన శిక్షణ

కొత్తపల్లి: ఉపాధి హామీ పనుల్లో వచ్చిన నూతన మార్పులను మేట్లు అవగాహన చేసుకోవాలని ఏపీఎం రాజబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మేట్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ మస్తర్లు, దినసరి వేతనం రూ.272 వచ్చేలా కొలతలు ఇవ్వడం, హాజరు నమోదు, పని చెప్పే విధానం, విధి విధానాలపై అవగాహన కల్పించినట్టు తెలిపారు. ముఖ్యంగా మేట్లు ఉపాధి పనుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. మస్తర్లు వేసేటప్పుడు ఎటువంటి దిద్దుబాట్లు లేకుండా చూసుకోవాలన్నారు.

అయోధ్య రామ మందిర అక్షతల ఊరేగింపు



సామర్లకోటలో అయోధ్య రామ మందిర అక్షతల ఊరేగింపులో విశ్వహిందూ పరిషత్తు సభ్యులు

సామర్లకోట: అయోధ్య రామ మందిరంలో పూజలు చేసిన అక్షతలను శనివారం ఊరేగించారు. మండలానికి వచ్చిన అక్షతలు, కరపత్రాలను గ్రామాల్లోని దేవాలయాల కమిటీ సభ్యులకు అప్పగించారు. వాటిని ఆయా దేవాలయాల్లో ప్యాకింగ్ చేసి ప్రతి ఇంటికి పంపిణీ చేయాలని నిర్ణయించారు. విశ్వహిందూ పరిషత్తు నాయకుల ఆధ్వర్యంలో అక్షతలు, చిత్రపటాలు, కరపత్రాలను సామర్లకోట పురవీధుల నుంచి ఊరేగించారు. వందల మంది భక్తులతో ప్రారంభమైన ఊరేగింపులో మహిళలు కోలాటం నిర్వహించారు. శ్రీరామ జయరామ జయజయరామ అంటూ కీర్తనలు ఆలపిస్తూ ముందుకు సాగారు. అయోధ్య రామ మందిర అక్షతలు ఆదివారం నుంచి ఆయా ఆలయాల కమిటీ సభ్యులు ప్రతి ఇంటికి పంపిణీ చేస్తారని విశ్వహిందూ పరిషత్తు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బిక్కిన రాజు, భగవద్గీత పారాయణ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున స్వామి తెలిపారు. ఈ ఊరేగింపులో విశ్వహిందూ పరిషత్తు నాయకులు జీవీకే మోహనరావు, కర్రి ఆదినారాయణరెడ్డి, వల్లూరి బుల్లియ్య, కేదారి శెట్టి సుబ్బారావు, కె.అర్జునరావు, అలకంటి చంటిబాబు, యార్లగడ్డ శ్రీను పాల్గొన్నారు.

స్నేహ పూర్వకంగా న్యూ ఇయర్

కొత్తపల్లి: ప్రతి ఒక్కరూ స్నేహ పూర్వక వాతావరణంలోనే ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలను చేసుకోవాలని ఎస్సై స్వామి నాయుడు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆదివారం అర్ధరాత్రి 12 గంటల వరకూ మాత్రమే వేడుకలు నిర్వహించుకోవాలన్నారు. ప్రధాన రహదారులు, బహిరంగ ప్రదేశాలలో వేడుకలకు ఎటువంటి అనుమతులు లేవన్నారు. మద్యం తాగి, వాహనాల సైలెన్సర్‌లు తొలగించి భారీ శబ్దాలతో వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు. వేడుకలలో డీజేలు, బాణసంచా కాల్చడానికి ఎటువంటి అనుమతులు లేవని అన్నారు.

మీరు ఉన్నట్టా.. లేనట్టా?



పెద్దాపురం కౌన్సిల్ సమావేశంలో అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు రాజశేఖర్, వీర్రాఘవ (అంతరచిత్రం) సమాధానమిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ తులసీ మంగతాయారు

- టౌన్ ప్లానింగ్ విభాగంపై కౌన్సిలర్ల ఆగ్రహం
- అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించిన సభ్యులు
- వాడీవేడిగా పెద్దాపురం మున్సిపల్ సమావేశం

పెద్దాపురం: పట్టణంలో టౌన్ ప్లానింగ్ విభాగం ఉన్నట్టా.. లేనట్టా? అసలు మీరేం చేస్తున్నారు.. అనధికార లేఅవుట్‌లపై దృష్టి సారించరా.. అంటూ అధికారులను మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు నిలదీశారు. పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, విడదాసరి రాజా, త్సలికి సత్యభాస్కర్, ఆరెళ్లి వీర్రాఘవు మాట్లాడుతూ పట్టణంలో అక్రమ భవన నిర్మాణాలు, అనధికార లేఅవుట్‌లు ఉన్నా అధికారుల పర్యవేక్షణ కొరవడుతుందన్నారు. ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోని అంశాలు సరిగ్గా రూపొందించకపోవడం దారుణమన్నారు. పట్టణంలో అనేక చోట్ల మున్సిపల్ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండడం సరికాదన్నారు. ఉన్న సిబ్బంది సేవలు వినియోగించుకుని మున్సిపల్ ఆదాయాన్ని పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని వారు సూచించారు. కౌన్సిలర్ రాజశేఖర్ మాట్లాడుతూ అనధికార కుళాయి కనెక్షన్లపై దృష్టి సారిస్తే మున్సిపాలిటీకి ఆదాయం వస్తుందన్నారు. జనన, మరణ ధ్రువపత్రాల విషయంలో అవినీతి జరుగుతుందని ఆరోపణలు ఉన్నాయని, దీనిపై ఆదాయం తక్కువ చూపించడానికి కారణాలు తెలపాలన్నారు. కౌన్సిలర్ త్సలికి సత్యభాస్కర్ మాట్లాడుతూ వివాహ రిజిస్ట్రేషన్‌కు పూర్తిగా ఉచితం కాగా రూ.300 ఎందుకు తీసుకుంటున్నారని నిలదీశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు వివరణ ఇస్తూ 60 రోజులు దాటితేనే అపరాధ రుసుము ఉంటుందని చెప్పారు. పట్టణంలో మున్సిపల్ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా రక్షణ కల్పించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ సాయిప్రసాద్, చైర్ పర్సన్ తులసీ మంగతాయారు ఆదేశించారు. అనంతరం పలు అంశాలపై వాడీవేడిగా చర్చ సాగింది. వైస్ చైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మి, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, డీఈఈ ఆదినారాయణ, ఆర్ఓ చంద్రశేఖరం, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు షేక్ రఫీ, వాసంశెట్టి గంగ, కౌన్సిలర్లు సయ్యద్ అమీనాబీబీ, పేరింశెట్టి అంబిక, ముప్పన శ్యామలాంబ పాల్గొన్నారు.

అధికారులూ నిద్ర వీడండి..



సామర్లకోటలో అధికారుల తీరుపై ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు



సభ్యులకు సమాధానం ఇస్తున్న చైర్‌పర్సన్ అరుణ, డీఈ అనంతలక్ష్మి

సామర్లకోట: స్థానిక మున్సిపల్ సమావేశం చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అజెండాలో 8వ అంశంపై చర్చ సాగింది. రాజమహేంద్రవరానికి చెందిన ఒక సంస్థ అభివృద్ధి పనుల నాణ్యతా ప్రమాణాలను పరిశీలించడానికి టెండరు వేయగా అది ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదని అధికార పక్ష కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, రెడ్నం సునీత, నేతల హరిబాబు, గుబ్బల సత్యనారాయణ, పిట్టా సత్యనారాయణ, జట్ల మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై డీఈఈ అనంతలక్ష్మి మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ సూచనల మేరకే ఆ టెండర్‌ను తొలగించామన్నారు. టెండర్లను ఆమోదించడం, వ్యతిరేకించే అధికారం కౌన్సిల్‌కు మాత్రమే ఉంటుందని, అటువంటిది అధికారులు నిర్ణయం తీసుకోవడం ఏంటని అధికారపక్ష సభ్యులు ప్రశ్నించారు. ఈ అంశాన్ని రద్దు చేసి తిరిగి టెండరు పిలవాలన్నారు. 2018లో జరిగిన పనులకు ప్రస్తుతం బిల్లులు ఆమోదించాలని కోరడం సరికాదని, ఇంతకాలం అధికారులు నిద్ర మత్తులో ఉన్నారా అని అధికార పక్ష సభ్యులు రెడ్నం సునీత, ఆవాల లక్ష్మీనారాయణ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో నాలుగు అవుట్ సోర్సింగ్ పోస్టులు ఖాళీగా ఉండగా, కేవలం ఒక పోస్టు కోసమే అజెండాలోకి తీసుకు రావడాన్ని ఆవాల లక్ష్మీనారాయణ తప్పుపడుతూ ఆ అంశాన్ని వాయిదా వేయాలని అన్నారు. దీంతో 8, 10 అంశాలను వాయిదా వేస్తున్నట్లు చైర్‌పర్సన్ అరుణ ప్రకటించారు. మున్సిపాలిటీ పరిధిలో కుక్కల సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదని కరణం రాజ్‌కుమార్ అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో 9 నెలల కిందట నిధులు మంజూరైనా పనులు ప్రారంభించలేదని 14వ వార్డు కౌన్సిలర్ స్వయంభారపు వీరభద్రరావు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధి పనులకు సంబంధించిన అజెండా ముందు రోజు రాత్రి ఇవ్వడం, కౌన్సిల్ సమావేశంలో కమిషనర్ లేకపోవడంపై నేతల హరిబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై చర్చించడానికి అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని చైర్‌పర్సన్ అరుణ సభ్యులకు తెలిపారు. సమావేశానికి ముందు మాజీ కౌన్సిలర్, ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్ బాబు మృతికి నేతల హరిబాబు ప్రతిపాదన మేరకు రెండు నిమిషాలు మౌనం పాటించారు.

అక్రమ కట్టడాలను అడ్డుకోలేరా!

- అధికారులను నిలదీసిన కౌన్సిలర్లు
- పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పిఠాపురం: పట్టణంలో యథేచ్ఛగా సాగుతున్న అక్రమ కట్టడాల వల్ల మున్సిపల్ ఆదాయానికి గండి పడుతోందని కౌన్సిలర్లు అధికారులను నిలదీసారు. పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన నిర్వహించారు. తొలుత అధికారులు అజెండాలో పొందుపరచిన అంశాలను చదివి వినిపించగా వాటిని ఆమోదిస్తు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ కొత్తగా వచ్చిన టీపీఓ సిబ్బందితో రహస్య మీటింగ్‌లు పెట్టడం, కౌన్సిలర్లకు తెలియకుండా వార్డుల్లో పనులు చేయించడం వంటి వాటిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రూ.50 వేల వరకు వివిధ పనులకు ఖర్చు చేసే అధికారం ఉన్నా మున్సిపల్ కమిషనర్ ఇప్పటి వరకు ఖర్చు చేసిన నిధుల జమాఖర్చులు చెప్పాలని కౌన్సిలర్లు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చిన కమిషనర్ కృష్ణవేణి వచ్చే సమావేశం నాటికి అన్ని జమా ఖర్చులు చూపిస్తానని చెప్పారు. అనంతరం అజెండాలో ప్రతిపాదించిన విషయాలపై చర్చ జరగగా పలువురు కౌన్సిలర్లు స్థానిక సమస్యలపై అధికారులను నిలదీశారు.



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

పారిశుధ్య సమస్య పెరుగుతోందని వీధిలైట్లు, డ్రైన్లు, రోడ్లు పట్టణంలో చాలా అధ్వానంగా ఉన్నాయని వాటిని వెంటనే అభివృద్ధి చేయాలని సభ్యులు సమావేశంలో గళమెత్తారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్‌లు పచ్చిమళ్ల జ్యోతి, కొత్తపల్లి పద్మ, పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే దొరబాబు
- జల్ జీవన్ మిషన్‌లో ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణానికి శంకుస్థాపన

కొత్తపల్లి: ప్రతి ఇంటికీ ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ నిధులతో నిర్మించనున్న ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌కు, తాగునీటి ట్యాంకులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. వాకతిప్ప శివారు ఉన్న నాగులపల్లి ప్రాంతం, పరిసర గ్రామాల రక్షితనీటి పథకంలో రూ.7 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు, అమీనాబాదులో రూ.1.18 కోట్లు, పొన్నాడ శివారు రామన్నపాలెంలో రూ.43.60 లక్షలతో తాగునీటి పైపులైన్లు, ఓవర్ హెడ్ ట్యాంకులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ అందించనున్నట్టు తెలిపారు. ఇప్పటికే సుమారు రూ.200 కోట్లతో జల్ జీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేసినట్టు తెలిపారు. దీనిలో భాగంగా ఇప్పటికే పలు గ్రామాల్లో పనులు పూర్తయ్యాయని తాగునీరు కూడా అందించనున్నట్టు తెలిపారు. సంక్షేమ పథకాలు చూసి వైఎస్సార్ సీపీకి మళ్లీ పట్టం కట్టాలని ఆయన కోరారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ఎల్లో మీడియా, పచ్చ చొక్కాల నాయకులు విషం కక్కుతున్నారు. తాగునీటి ప్రాజెక్ట్ ఏర్పాటుకు, అభివృద్ధికి కృషి చేస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావును ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పాలాని దొరబాబు, సక్కా మణికంఠబాబు, వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అభివృద్ధి కమిటీ సభ్యుడు జ్యోతుల బాబులు, ఎంపీటీసీలు అనిశెట్టి సుభాషిణి, రాయుడు విష్ణు, ఎస్సీ, ఎస్టీ డివిజన్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీదేవి, ఎంపీడీఓ వెంకట నారాయణ, ఏఈ సంధ్య తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి పథకంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

ప్రజారోగ్యానికి పెద్దపీట

పిఠాపురం: ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం స్వచ్ఛమైన తాగునీటిని అందించడం ద్వారా ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండడానికి జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేస్తున్నట్టు ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. ఆయన శనివారం పిఠాపురం మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన పిఠాపురం మండలం చిత్రాడలో జల్ జీవన్ మిషన్ నిధులు రూ.1.79 కోట్లతో నిర్మించిన ఇంటింటికి కుళాయి కనెక్షన్‌లను, వాటర్ ట్యాంకును ప్రారంభించారు. జల్ జీవన్ మిషన్ నిధులు రూ.87.3 లక్షలతో నిర్మించనున్న ఇంటింటికి కుళాయి కనెక్షన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు జవ్వాది నాయుడు, సర్పంచ్ సునీత, ఉప సర్పంచ్ దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ నేతలు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



చిత్రాడలో వాటర్ ట్యాంకును ప్రారంభించిన ఎమ్మెల్యే పెండెం దొరబాబు

ఉత్కంఠగా కబడ్డీ పోటీలు

- ప్రారంభించిన దొరబాబు
- 'ఆడుదాం ఆంధ్రా'కు ఆదరణ

సామర్లకోట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలకు ఆదరణ పెరుగుతోంది. ఇప్పటికే తమ పేర్లు నమోదు చేయించుకున్న క్రీడాకారులు నిర్ణీత సమయానికి క్రీడా మైదానాలకు హాజరవుతున్నారు. తమ వార్డులోని క్రీడాకారులను గెలిపించుకోవడం కోసం ఆయా ప్రాంతాలకు చెందిన వారు ప్రోత్సాహం అందిస్తుండడంతో క్రీడాకారుల్లో ఉత్సాహం పెరుగుతోంది. శనివారం సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలో క్రికెట్, కబడ్డీ పోటీలు జరిగాయి. కబడ్డీ పోటీలను సీనియర్ కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ ప్రారంభించారు. మండలంలో క్రికెట్ పోటీల్లో భాగంగా అచ్చంపేటలో పోటీలకు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు శ్రీకారం చుట్టారు. ఈ పోటీల్లో అంతా ఉత్సాహంగా పాల్గొని, ఐక్యత చాటాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీపీ డి.శ్రీలలిత, ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, గ్రామ సర్పంచ్ వీరంరెడ్డి చినబాబు తదితరులు పాల్గొన్నారు.



సామర్లకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తపల్లి: కుక్క కాటుకు గురైన ఒక వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు శనివారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక ఎస్సీ పేటకు చెందిన కొల్లాబత్తుల నూకరాజు (78) నెల రోజుల క్రితం కుక్కకాటుకు గురయ్యాడు. కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురి కావడంతో చికిత్స నిమిత్తం ఈ నెల 28న కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. దీనిపై ఎస్సై స్వామి నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం లేని న్యూ ఇయర్ వేడుకకు ఆహ్వానం

పిఠాపురం: నూతన సంవత్సర వేడుకలను మద్యంతో కాకుండా ఆడుతు పాడుతూ స్వీట్లు పంచుకుని ఆనందంగా జరుపుకోవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ సూర్యనారాయణ ప్రజలకు పిలుపు నిచ్చారు. ఆయన ఆధ్వర్యంలో శనివారం పిఠాపురం, గొల్లప్రోలులో పిఠాపురం మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ, జన విజ్ఞాన వేదిక సభ్యులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ర్యాలీలు నిర్వహించి ప్రజలను చైతన్య పరిచారు. మద్యపానం ఆరోగ్యానికి హానికరం.. మద్యాన్ని నిషేధించండి.. మానవాళిని రక్షించండి, నాన్నా తాగొద్దు, అన్నయ్యా తాగొద్దు.. అంటూ నినాదాలు చేస్తు ర్యాలీ నిర్వహించారు. పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో మద్యం లేకుండా న్యూ ఇయర్ వేడుకలను నిర్వహించాలని పిఠాపురం మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ, జన విజ్ఞాన వేదిక సభ్యులు అన్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణ, ఏలేటి నానిబాబు, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజశేఖర్ పిఠాపురం మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ, జన విజ్ఞాన వేదిక సభ్యులు, ఆర్ఆర్‌బీహెచ్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ వి.కేశవరావు, పలువురు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన భక్తిపారవశ్యం

పెద్దాపురం: భక్తిపారవశ్యం వెల్లివిరిసింది.. ఆ శృంగార వల్లభస్వామిని కొలిచిన భక్తజనం తన్మయత్వం చెందింది.. మండలంలోని తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే వేల సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ టిక్కెట్లు, అన్నదానం, కేశఖండన ద్వారా స్వామివారికి రూ.1.81 లక్షల ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు. దాతలను ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాలను అందజేశారు.



తిరుపతి శృంగారవల్లభస్వామి

ఆకట్టుకున్న మ్యాజిక్ చదరం

533	486	479	526
478	527	532	487
528	481	484	531
485	530	529	480

ఎటు కూడినా 2024 వచ్చే మ్యాజిక్ చదరం



తోటకూర సాయిరామకృష్ణ

సామర్లకోట: నూతన సంవత్సరం 2024కు స్వాగతం పలుకుతూ గణితావధాని, బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ తయారు చేసిన మ్యాజిక్ చదరం అందరినీ ఆకర్షించింది. మ్యాజిక్ చదరంలో ఏ అడ్డు వరసలు, కర్ణముల నాలుగు అంకెలు కూడినా 2024 వస్తుందని సాయిరామకృష్ణ తెలిపారు. ఈ చదరాన్ని అన్ని వేర్వేరు సంఖ్యలతో తయారు చేశానన్నారు.

రైల్వే స్టేషన్‌కు ఐఎస్ఓ సర్టిఫికెట్



విజయవాడ డీఆర్ఎం నుంచి ఐఎస్ఓ సర్టిఫికెట్ అందుకున్న స్టేషన్ మేనేజర్ రమేష్

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌కు ఐఎస్ఓ సర్టిఫికెట్ వచ్చిందని రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ తెలిపారు. శుక్రవారం విజయవాడలో రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఎ.పాటిల్ రైల్వే స్టేషన్ ఉత్తమ నిర్వహణకు సంబంధించి ఐఎస్ఓ సర్టిఫికెట్ అందజేశారని ఆయన శనివారం తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ స్టేషన్‌లో స్వచ్ఛమైన తాగునీరు అందించడంతో పాటు ప్లాట్‌ఫారాలు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండటం, టిక్కెట్ల విధానం సక్రమంగా జరగడం, ప్రయాణికులకు నాణ్యత కలిగిన ఆహార పదార్థాలు అందించడంతో ఈ సర్టిఫికెట్ వచ్చిందన్నారు. స్టేషన్‌లో పని చేస్తున్న వివిధ శాఖల అధికారుల సహకారంలో ఇది సాధ్యమైందన్నారు.

నేడు సామర్లకోటకు అమృత్ భారత్

రైల్వే శాఖ కొత్తగా ప్రవేశపెట్టిన అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ట్రయిల్ రన్‌లో భాగంగా ఆదివారం సాయంత్రం సామర్లకోటకు వస్తుందని స్టేషన్ మేనేజర్ రమేష్ తెలిపారు. విజయవాడ డివిజనల్‌లో తుని, సామర్లకోట, రాజమహేంద్రవరం, ఏలూరు, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు స్టేషన్‌లలో ఆగుతుందని చెప్పారు. 22 బోగీలతో ఉండే ఈ రైలులో 12 నాన్ ఏసీ బోగీలు, 8 సాధారణ బోగీలు ఉంటాయన్నారు.

రైల్వే క్రాసింగ్‌ల వద్ద పరిశీలన



గొల్లప్రోలు రైల్వే ట్రాక్ పరిశీలిస్తున్న అధికారులు

పిఠాపురం: రైల్వే క్రాసింగ్‌ల వద్ద పరిస్థితులను విజయవాడ రైల్వే సెక్షన్ సీనియర్ ఇంజినీర్ టి.అప్పలరాజు ఆధ్వర్యంలో పలువురు అధికారులు పరిశీలించారు. రోడ్లు భవనాల శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, నీటిపారుదల శాఖ, రెవెన్యూ, విద్యుత్ శాఖ తదితర శాఖల అధికారులు శనివారం గొల్లప్రోలు నగర రైల్వే పరిధిలో సూరంపేట, మల్లవరం రైల్వే గేట్ల వద్ద ఆర్ఓబీ, ఆర్‌యూబీల నిర్మాణాలపై సర్వే నిర్వహించారు. ఆయా ప్రదేశాల్లో వాహనాల రాకపోకలు పెరగడంతో పాటు ప్రజలు పడుతున్న ఇబ్బందులను విశ్లేషించారు. నివేదికలను ఉన్నతాధికారులకు అందజేస్తామని అవసరాలకు అనుగుణంగా ఆర్ఓబీ, ఆర్‌యూబీల నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.